# దక్షిణాపథ వార్తావని

మే 2026

సంపుటి – 05
సంచిక – 03

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది. భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప రాజకీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

## నారద జయంతి (మే 2)



నారదుడి గురించి తెలియని హిందువు ఉండడు. నారదుడు దేవముని, బ్రహ్మదేవుని పుత్రుడు, శ్రీమన్నారాయాణునికి పరమ భక్తుడు. నారం దదాతి ఇతి నారద: అని వ్యుత్పత్తి. నార అనగా జ్ఞానం, దా అంటే ఇచ్చువాడు. బ్రహ్మానందాన్ని, ఆత్మజ్ఞానాన్ని ఇచ్చువాడు కనుక నారదుడని పేరు పొందాడు.


నారదుడు ఆత్మజ్ఞానం కోరుతూ సనత్కుమార మహర్షిని కలిసినట్లు ఛాందగ్యోపనిషత్తులో కనిపిస్తుంది. అందులో నాకు బోధ చేయండి అని నారదుడు అడగ్గా, మీకేమి తెలుసో చెప్పండి అని సనత్కుమారుడు అడుగుతారు. అప్పుడు నారదుడు తనకు 4 వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, వేదాంగాలు మొదలైనవన్నీ తెలుసనని చెప్తాడు. ఆ తర్వాత సనత్కుమార మహర్షి నుంచి ఆత్మజ్ఞానం పొందుతాడు. ఈ సంవాదం ద్వారా మనకు తెలిసేదేమిటంటే నారదుడు వేదవేదాంగాలు చదివినప్పటికీ అంతిమ జ్ఞానమైన ఆత్మజ్ఞానం కోసమై సనత్కుమార మహర్షినే ఆశ్రయించి, దానిని పొందారు. ఆయన త్రిలోక సంచారి. ఆయన ధర్మాలను ఉపదేశం చేస్తారు.

నారదునికి సర్వం తెలుసు. ఏమి చేస్తే లోకకళ్యాణం జరుగుతుందో తెలుసు. ఆయన చర్యలన్నీ దైవకార్యం నెరవేర్చటానికే. శ్రీ రామాయాణ గ్రంధం వాల్మీకి రాయడానికి ఒక కారణం నారదుడు. ఈ లోకంలో 16 గుణాలతో విరాజిల్లుతున్న ధర్మమూర్తి ఎవరని నారదుడు వచ్చి వాల్మీకి మహర్షిని అడగడంతోనే శ్రీ రామాయణం మొదలవుతుంది. మహాభారతంలో మనం నారదుని రాజనీతి తెలిసినవాడిగా చూస్తాము.

ఆయన ఇంద్రప్రస్థానికి వచ్చి యుధిష్టరునికి రాజనీతి, ధర్మం మీద ఉపదేశం ఇస్తారు. నారద భక్తి సూత్రాల పేరుతో నారదుడు చెప్పిన భక్తి సూత్రాలు అద్భుతంగా ఉంటాయి. అలాగే నారదునికి సంబంధించి నారదపాంచరాత్రము, నారదస్మృతి, నారదపరివ్రాజోకోపనిషత్తు మొదలైన గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. ధృవుడికి నారాయణ మంత్రాన్ని ఉపదేశించి, శ్రీ మహావిష్ణువు దర్శనం పొందేలా చేసిన గురుస్వరూపుడు నారదుడు.

అలాగే ప్రహ్లాదుడు తన తల్లికడుపులో ఉండగా, ఆమె ద్వారా ప్రహ్లాదునికి భక్తిని, పరమాత్మ తత్త్వాన్ని బోధించి, భక్తులలో అగ్రగణ్యుడైన ప్రహ్లాదుని లోకానికి అందించినవాడు నారదుడు. గురుస్వరూపుడు, త్రిలోకసంచారి, జ్ఞానమూర్తి అయిన నారదమునిని స్మరించి, ధ్యానిద్దాం.

## స్వామి చిన్మయానంద (జన్మతిథి, మే 8)



స్వామి చిన్మయానందగా ప్రసిద్ధి చెందిన బాలకృష్ణన్ మీనన్, 1917వ సంవత్సరం మే 8వ తేదీన కేరళలోని ఎర్నాకుళంలో ఒక ఉన్నత కుటుంబంలో జన్మించారు. గంటల తరబడి సాగే వారి కుటుంబ దైనందిన పూజలతో కూడిన కట్టుదిట్టమైన దినచర్య, ఆ యువకుడి మానసిక మరియు నైతిక విలువల నిర్మాణంలో ముఖ్యపాత్రను వహించింది. దీనికి తోడు, సాధు స్వభావం గల తన కుటుంబ గురువుల ప్రభావానికి లోనయ్యే అరుదైన అవకాశం ఆయనకు లభించింది. చిన్నతనం నుండే ప్రతి విషయాన్ని విమర్శనాత్మకంగా ప్రశ్నించే జిజ్ఞాస ఆయనకు ఉండేది. ఆయన చదువులో కూడా అంతే. ప్రతిభావంతుడైన బాలకృష్ణన్, లక్నో విశ్వవిద్యాలయం నుండి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పొందారు. విశ్వవిద్యాలయాల నుండి బయటకు వచ్చిన తర్వాత జీవితంలో ఏమి చేయాలో తెలియక సందిగ్ధంలో పడే ఎంతోమంది విద్యావంతులైన యువకుల్లాగే, బాలకృష్ణన్ కూడా పరస్పర విరుద్ధమైన భావజాలాలతో కూడిన సందేహాలతో సతమతమయ్యారు. కానీ దైవ సంకల్పం ఆయనకు సరైన మార్గాన్ని చూపింది; ఆయన స్వామి వివేకానంద, అరవిందో తదితరుల గొప్ప రచనలను అధ్యయనం చేసి, తన గురువైన స్వామి శివానందను చేరుకున్నారు.

www.dakshinapatha.com www.csisindia.com

దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925

స్వామి శివానంద మహారాజ్, బాలకృష్ణన్ అసాధారణ ప్రతిభావంతుడని గ్రహించి, ఒక గీతా కమిటీని నిర్వహించే బాధ్యతను అతనికి అప్పగించారు. ఆ కమిటీలో శ్రీ బాలకృష్ణ మీనన్ (స్వామి చిన్మయానంద), స్వామి కృష్ణానంద, బీహార్‌కు చెందిన శ్రీ నంద కిషోర్ శ్రీవాస్తవ అనే గొప్ప విద్వాంసుడైన తత్వవేత్త మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. అతను అప్పుడప్పుడు ఆశ్రమంలో తరగతులు నిర్వహించేవాడు. శాస్త్రాలను మరింతగా అధ్యయనం చేయడానికి, 1949 ఫిబ్రవరి 25న శ్రీ గురుదేవ్ అతనికి సన్యాస దీక్ష ఇచ్చారు. అతను ఉత్తరకాశీలో స్వామి తపోవనం మహారాజ్ వద్ద ఉంటూ, ఆ మహనీయునితో కలిసి పంచదశి, ఇతర వేదాంత గ్రంథాలు, అలాగే ఉపనిషత్తులను అభ్యసించారు. ఈ గ్రంథాలలో ప్రావీణ్యం సంపాదించారు. 1953 లో చిన్మయ మిషన్ ప్రారంభించిన స్వామి చిన్మయానంద, గీతా జ్ఞాన యజ్ఞ మిషన్‌ను ప్రారంభించి, భారతదేశంలోని నలుమూలలా పర్యటిస్తూ గీతా యజ్ఞ తరగతులు, ఉపనిషత్ తరగతులు మరియు శాస్త్రాలపై ప్రసంగాలు నిర్వహించారు. దీనివల్ల ఆయన ఒక అసాధారణ వక్తగా, భారతదేశ సంస్కృతి, దాని సాహిత్య వారసత్వం మరియు శాస్త్ర విజ్ఞానంలో నిష్ణాతుడైన వ్యాఖ్యాతగా గొప్ప కీర్తిని పొందారు. స్వామి చిన్మయానంద అనేకసార్లు పశ్చిమ దేశాలకు కూడా ప్రయాణించారు. ఆయన సంస్థలకు భారతదేశంలోని వివిధ ప్రదేశాలలో మరియు విదేశాలలో కూడా కేంద్రాలు ఉన్నాయి.

స్వామి చిన్మయానంద భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వ పతాకాన్ని కేవలం ఈ దేశంలోనే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలలో కూడా ఎగురవేసిన ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తులలో ఒకరు.

## బీదర్ జిల్లా దోరటా బి గ్రామం పైన రజాకార్ల దాడి (మే 10)



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థానం నిజాం ఆధీనంలోనే ఉండిపోయింది. నిజాం నిరంకుశ పాలనను కొనసాగించేందుకు ముస్లిం రజాకార్లు చరిత్రలో అత్యంత హేయమైన దుశ్చర్యలకు పాల్పడ్డారు. వీరికి ఖాసిం రిజ్వీ నాయకుడు.

నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రాంతంలో సామాన్య ప్రజలు తిరగబడ్డారు. ఈ పోరాటమే హైదరాబాద్ విమోచన పోరాటంగా పేరొందింది.

ప్రస్తుతం కర్ణాటక లోని బీదర్ జిల్లా దోర్తా–బి ఒక చిన్న వ్యవసాయ గ్రామం. గ్రామంలో రైతులు, కూలీలు అధికంగా ఉండేవారు. ఈ ప్రాంతంలో ప్రజలు నిజాం పాలనను వ్యతిరేకించారు. దీనితో ఈ గ్రామంపై రజాకార్ల దృష్టి పడింది.

చారిత్రక వర్ణనల ప్రకారం, మే 10 ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో సమీప ప్రాంతాల నుండి రజాకార్లు గుంపులుగా చేరారు. కొందరు ఆయుధాలతో (తుపాకులు, కత్తులు, లాఠీలు) వచ్చారు. వీరంతా గ్రామాన్ని చుట్టుముట్టి అకస్మాత్తుగా దాడి చేశారు. అక్కడి ప్రజలు పారిపోకుండా మార్గాలను మూసివేశారు. పిదప ఇళ్లను దోచుకోవడం, ఆ తర్వాత కాల్చివేయడం, ధాన్యం, పశువులు దోచుకోవడం, గ్రామ పెద్దలు, నాయకులను నిర్దాక్షిణ్యంగా చంపివేయడం వంటి అత్యంత భయానక హింసను కొనసాగించారు. మహిళలపై అత్యాచారాలు, పిల్లలను హింసించడం వీరి దాష్టీకంలో భాగమే.

ఈ మారణకాండ నుండి తప్పించుకోగలిగిన గ్రామస్తులు భయంతో సమీపంలోని అడవుల్లోకి, పొలాల్లోకి పారిపోయారు. కుటుంబాలు విడిపోయాయి.

ఈ దాడి కేవలం దోపిడీ కోసం కాదు. దీని ప్రధాన లక్ష్యం నిజాం వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయడం, గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేయడం, తద్వారా ఇతర గ్రామాలకు హెచ్చరిక ఇవ్వడం.

ఈ దాడి తర్వాత గ్రామం చాలా వరకు నాశనం అయింది. అక్కడి ప్రజలు తాత్కాలికంగా గ్రామాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చింది. కానీ ఈ సంఘటన తర్వాత ప్రజలలో రజాకార్లపై మరింత వ్యతిరేకత పెరిగింది. ఈ దోరటా బి సంఘటన తెలంగాణ ప్రాంతంలో నిజాం వ్యతిరేక ప్రజా ప్రతిఘటనను పెంచిన ఘటనల్లో ఒకటిగా గుర్తించబడింది. నిజాం ఆదేశాలతో రజాకార్లు ఇలాంటి అనేక గ్రామాలపై జరిపిన దాడులే చివరకు భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో చర్య చేపట్టడానికి ఒక కారణంగా మారాయి.

## ఆపరేషన్ శక్తి (మే 11)



మే 11 భారతదేశ చరిత్రలో అత్యంత గర్వకారణమైన రోజుల్లో ఒకటి. ఈ రోజున భారతదేశం ప్రపంచానికి తన శక్తిని, స్వాభిమానాన్ని, సాంకేతిక సామర్థ్యాన్ని చాటిచెప్పింది. ఈ ఘనతకు కారణమైనది ఆపరేషన్ శక్తి పేరిట జరిగిన పోఖ్రాన్ 2 అణు పరీక్షలు.

1998 మే 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారిలో భారతదేశం విజయవంతంగా మూడు అణు పరీక్షలను నిర్వహించింది. తరువాత మే 13న మరో రెండు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ద్వారా భారతదేశం ప్రపంచానికి "మేము కూడా అణుశక్తి కలిగిన దేశమే" అని స్పష్టంగా ప్రకటించింది. ఇది కేవలం సైనిక శక్తి ప్రదర్శన మాత్రమే కాదు – దేశ స్వాభిమానానికి ప్రతీక.

జాతీయవాద దృక్పథంలో చూస్తే, ఈ అణు పరీక్షలు భారత భద్రతకు అత్యంత కీలకం. చుట్టూ ఉన్న దేశాలు, ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ అప్పటికే అణుశక్తిని సంపాదించుకున్న సమయంలో, భారతదేశం కూడా తన రక్షణను బలపరచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తీసుకున్న నిర్ణయం దేశానికి ఒక భద్రతా కవచంలా మారింది.

ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన శక్తి అప్పటి ప్రధాన మంత్రి శ్రీ అటల్ బిహారీ వాజపేయీ గారు. ఆయన నాయకత్వం దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. అంతర్జాతీయ ఒత్తిళ్లు, ఆర్థిక ఆంక్షలు ఉండబోయే పరిస్థితిని తెలిసినా, దేశ ప్రయోజనాలను ముందుంచి ఈ పరీక్షలకు అనుమతి ఇచ్చారు.

ఈ విజయానికి భారత శాస్త్రవేత్తల అహర్నిశల కృషి మూలం. ముఖ్యంగా శ్రీ ఏ పి జె అబ్దుల్ కలాం మరియు శ్రీ ఆర్ చిదంబరం వంటి ప్రముఖ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. వారి

కృషి వల్ల భారతదేశం స్వదేశీ సాంకేతికతతో అణు సామర్థ్యాన్ని సాధించింది.

ఈ పరీక్షల తరువాత అమెరికా సహా పలు దేశాలు భారతదేశంపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. కానీ భారతదేశం దృఢంగా నిలబడింది. దీనితో భారతదేశం తన జాతీయ ప్రయోజనాల కోసం ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కోగలదు అనే సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పినట్లైనది.

జాతీయవాద దృక్పథంలో, ఆపరేషన్ శక్తి భారత ఆత్మగౌరవానికి ప్రతీక. ఇది మనకు మూడు ముఖ్యమైన సందేశాలను ఇస్తుంది. దేశానికి స్వయం సమృద్ధి అవసరం, దేశ భద్రతకు మించిన ప్రాధాన్యత మరోటి లేదు మరియు ప్రపంచంలో గౌరవప్రద స్థానం పొందాలంటే శక్తి అవసరం.

మే 11 కేవలం ఒక తేదీ కాదు, అది భారత శక్తి, స్వాభిమానం, ధైర్యానికి చిహ్నం. ఆపరేషన్ శక్తి భారతదేశాన్ని ప్రపంచ అణు శక్తుల సరసన నిలబెట్టింది. దేశం బలంగా ఉండాలంటే శాస్త్రం, సాంకేతికత, ధైర్యం మరియు జాతీయ భావన అన్నీ కలిసిరావాలి. ఇది ప్రతి భారతీయుడు గర్వపడాల్సిన చారిత్రక ఘట్టం.

## వైద్యనాథ అయ్యర్ (జన్మతిథి, మే 16)



ఏ వైద్యనాథ అయ్యర్‌ని మదురై వైద్యనాథ అయ్యర్ లేదా అయ్యర్ అని కూడా పిలుస్తారు. ఈయన తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సామాజిక కార్యకర్త, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు. దళితుల ఆలయ ప్రవేశ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన నాయకుడు.

వైద్యనాథ అయ్యర్ 1890 మే 16 న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని తంజావూరులోని విష్ణంపేటాయ గ్రామంలో ఒక తమిళ బ్రాహ్మణ కుటుంబంలో అరుణాచలం అయ్యర్, లక్ష్మి అమ్మల్ దంపతులకు జన్మించారు.. అయ్యర్ మదురై సేతుపతి హైస్కూల్‌లో చదివారు. 1909 లో, అతను తన ఎస్ ఎస్ ఎల్ సీ పూర్తి చేశాడు. అయ్యర్ మదుర కళాశాలలో ఎఫ్ ఏ పొందారు. 1914 లో మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ నుండి తన బి ఏ పట్టా అందుకున్నారు. అతను తిరుచ్చిలోని బిషప్ హెబెర్ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఒక సంవత్సరం, మచిలీపట్నం హిందూ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఒక సంవత్సరం పాటు టీచర్‌గా పనిచేశాడు. అతను ప్రతిష్ఠాత్మకమైన నీలకంఠ శాస్త్రి బంగారు పతకంతో పాటు ఫిషర్ బంగారు పతకాన్ని కూడా పొందాడు. అతను ప్లీడర్ హోదా పొందడానికి ముందు 1922 కాలంలో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించాడు. అతను వేదారణ్యం ఉప్పు సత్యాగ్రహం (1930), 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు.

వైద్యనాథ అయ్యర్ గారు చిన్నప్పటి నుంచే దేశభక్తి భావాలను అలవరుచుకున్నారు. ఆయన విద్యాభ్యాసం, ముఖ్యంగా న్యాయశాస్త్ర కోవిదుడు కావడంతో, న్యాయం, సమానత్వం, హక్కుల గురించి లోతైన అవగాహనను ఇచ్చింది. ఈ అవగాహన తర్వాత ఆయనను జాతీయవాద మార్గంలో నడిపించింది.

ఆ కాలంలో భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉండటం వల్ల ప్రజలలో అసంతృప్తి పెరుగుతూ ఉండేది. ఈ పరిస్థితుల్లో, గాంధీజీ వంటి నాయకుల ఆలోచనలు ఆయనపై ప్రభావం చూపాయి. గాంధీజీ సూచించిన అహింసా సిద్ధాంతం, సత్యాగ్రహం వంటి మార్గాలను ఆయన స్వీకరించి, స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొన్నారు. ఉద్యమాల సమయంలో బ్రిటిష్ చట్టాలను ధిక్కరించడం, ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించడం, దేశభక్తి సందేశాలను విస్తరించడం వంటి కార్యక్రమాల్లో ముందుండి పనిచేశారు. ఆయనను పలుమార్లు అరెస్టు చేసి జైలుకు పంపినా, ఆయన సంకల్పం దెబ్బతినలేదు. ఇది ఆయన జాతీయవాద ధృఢత్వానికి స్పష్టమైన ఉదాహరణ.

వైద్యనాథ అయ్యర్ గారి జాతీయవాదం కేవలం రాజకీయ స్వాతంత్ర్యంకోసమే పరిమితం కాలేదు. ఆయన దృష్టిలో "స్వాతంత్ర్యం" అంటే ప్రతి వ్యక్తికి సమాన హక్కులు ఉండాలి అన్నది. అందుకే ఆయన సామాజిక సంస్కరణల వైపు కూడా దృష్టి పెట్టారు.

1939లో ఆయన నాయకత్వంలో మదురై మీనాక్షీ అమ్మవారి దేవాలయంలో దళితులకు ప్రవేశం కల్పించడం ఒక చారిత్రాత్మక ఘట్టం. ఇది కేవలం ఒక సామాజిక సంస్కరణ మాత్రమే కాదు; భారత జాతీయవాదానికి ఒక నూతన అర్థాన్ని ఇచ్చింది. ఈ ఉద్యమం ద్వారా "దేశం స్వతంత్రం కావాలంటే, ముందుగా సమాజంలో సమానత్వ భావన రూపొందాలి" అనే భావన ఆయనను ఇతర నాయకుల నుండి ప్రత్యేకంగా నిలబెట్టింది.

ఈ ఆలయ ప్రవేశ ఉద్యమం వైద్యనాథ అయ్యర్ గారిని ఒక గొప్ప సామాజిక నాయకుడిగా కూడా నిలబెట్టింది. వైద్యనాథ అయ్యర్ నిబద్ధతతో స్వాతంత్ర్య పోరాటంలో నిరంతరంగా పాల్గొంటూనే, సామాజిక వ్యతిరేకత ఉన్నప్పటికీ, ఎంతో ధైర్యంతో ఆలయ ప్రవేశ ఉద్యమాన్ని విజయవంతం చేశారు. సేవాభావంతో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. సమానత్వ దృష్టి కలవాడై కుల వివక్షకు వ్యతిరేకంగా నిలబడ్డారు. సమాజ సమరసతకు పాటుపడ్డాడు.

వైద్యనాథ అయ్యర్ గారి కృషి భారతదేశంలో సమానత్వం, న్యాయం, మరియు జాతీయ ఐక్యతకు బలమైన పునాది వేసింది. ఆయన చేసిన ఆలయ ప్రవేశ ఉద్యమం తరువాతి సామాజిక సంస్కరణలకు మార్గదర్శకంగా నిలిచింది.

వైద్యనాథ అయ్యర్ 1955, ఫిబ్రవరి 23న తీవ్ర అనారోగ్యంతో మరణించారు. అతని జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

మొత్తంగా చూస్తే, వైద్యనాథ అయ్యర్ గారు కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాదు; ఒక ప్రఖర జాతీయవాది, ధైర్యవంతమైన సామాజిక సంస్కర్త. ఆయన జీవితమంతా దేశసేవకే అంకితం అయింది. ఆయన చూపించిన మార్గం - రాజకీయ స్వాతంత్ర్యం మరియు సామాజిక సమానత్వం, ఈ రెండూ కలిసినప్పుడే నిజమైన స్వేచ్ఛ సాధ్యమని తేటతెల్లమవుతుంది.

## జమలాపురం శ్రీ వేంకటేశ్వర ఆలయం (ఖమ్మం జిల్లా)



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు వెలసిన తిరుమల భూలోక వైకుంఠంగా ఖ్యాతి చెందింది. శ్రీనివాసుడు తిరుమల గిరుల్లో అర్చావతార మూర్తిగా, స్వయంభువుగా వెలిశాడు. అయితే వేంకటేశ్వరస్వామి కలియుగంలో తన భక్తుల కోరిక మేరకు అనేక ఇతర ప్రాంతాల్లో కూడా వెలిశాడు. అలాంటి పుణ్య క్షేత్రాలలో ఒకటైన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని దర్శిస్తే మొండి రోగాలు కూడా నయమవుతాయని విశ్వాసం.

కృతయుగే నారసింహాయ, త్రేతా యుగే రామచంద్రాయ, ద్వాపరే శ్రీకృష్ణాయ, కలియుగే వెంకటనాథాయ! అని పురాణాలు వివరిస్తున్నాయి. కలియుగంలో శ్రీ మహావిష్ణువు వేంకటేశ్వర స్వామిగా అవతరించాడని పురాణవచనం.

ఖమ్మం జిల్లాలో వెలసిన అతి ప్రాచీన వేంకటేశ్వర స్వామి క్షేత్రం జమలాపురం. స్వామి వారు ఇక్కడ స్వయంభువుగా ఆవిర్భవించడం వెనుక ఒక ఆసక్తికరమైన గాథ వినిపిస్తూ ఉంటుంది.

పూర్వం నేలకొండపల్లి ప్రాంతంలో ఒక సాధువు తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. పూర్వజన్మ కర్మవశాత్తు ఆయనకు కుష్ఠు వ్యాధి సోకింది. కుష్ఠు వ్యాధితో తాను పడుతున్న బాధల నుంచి విముక్తుడిని చేయమని వేంకటేశ్వరస్వామిని కోరుతూనే ఆయన తన తపస్సు కొనసాగించాడు. ఇలా చాలా కాలం కొనసాగింది. వేంకటేశ్వరుడు సాధువుకు స్వప్నంలో దర్శనమిచ్చి అతనికి కుష్ఠు వ్యాధి నుంచి విముక్తుడిని చేస్తున్నట్లుగా చెప్పడమే కాకుండా, సమీపంలో ఉన్న గుహలో 'తిరునామం' రూపంలో తను వెలుస్తున్నట్టుగా సెలవిచ్చాడట. మరుసటి రోజు ఉదయాన్నే సాధువు నిద్రలేచి తనను పరిశీలించి చూసుకోగానే తన శరీరం మీద కుష్ఠు వ్యాధి ఆనవాళ్ళు లేకపోవడం గమనించి ఆశ్చర్యపోయాడు. ఇదంతా వేంకటేశ్వర స్వామి మహత్యంగా భావించి స్వామి చెప్పిన గుర్తుల ప్రకారం అన్వేషణ సాగించాడు.

సాధువు అన్వేషణ ఫలించి ఒక కొండ గుహలో స్వామివారు తిరునామం రూపంలో వెలసి ఉండడాన్ని గమనించాడు. వెంటనే సాధువు అక్కడే వేంకటనాథునికి ఆలయాన్ని నిర్మించి నిత్యపూజలు చేయడం ప్రారంభించారు.

సాధువు కుష్ఠు వ్యాధి పోయిన సంగతి తెలుసుకున్న స్థానికులు ఆనాటి నుంచి ఇక్కడ కొండ గుహలో వెలసిన వేంకటేశ్వరుని దర్శించుకోవడానికి తరలి రావడం మొదలు పెట్టారు. అంతేకాదు ఈ వేంకటనాథుని దర్శిస్తే ఎంతటి మొండి రోగాలైనా తొలగిపోతాయని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇలా వేంకటనాథుని మహత్యం గురించి తెలుసుకున్న చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు విశేషంగా తరలి రావడంతో జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఖమ్మం నుంచి దాదాపు 79 కిలోమీటర్ల దూరంలో ఉన్న జమలాపురంలో ఉంది. 1000 సంవత్సరాలకు పైగా పురాతనమైన ఈ చారిత్రాత్మక ఆలయాన్ని విజయనగర పాలకులు కృష్ణ దేవరాయలు పునర్నిర్మించారని ఆలయంలోని శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రశాంతమైన వాతావరణంలో పచ్చని కొండల మధ్య వెలసి ఉన్న ఈ ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.

పురావస్తు శాఖ వారు సమీపంలోని నేలకొండపల్లిలో జరిపిన తవ్వకాల్లో మహాభారతానికి సంబంధించిన ఆనవాళ్లు కూడా లభ్యమైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ పరిశోధనలో నాలుగో శతాబ్దానికి చెందిన అనేక బౌద్ధ స్థూపాలు కూడా లభ్యం కావడం ఈ ప్రాంతం విశిష్టతను చాటుతోంది.

## మదురై చిత్రయి ఉత్సవం



తమిళనాడు మదురైలో జరిగే మీనాక్షి అమ్మవారి చిత్రై ఉత్సవం దక్షిణ భారతదేశంలోనే అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో ఒకటి. మీనాక్షి అమ్మవారి ఆలయం కేంద్రంగా జరిగే ఈ మహోత్సవం భక్తి, సంస్కృతి, చరిత్రల సమ్మేళనంగా నిలుస్తుంది.

వైశాఖ మాసంలో జరిగే చిత్రై ఉత్సవం "కొడియేట్రం" (ధ్వజారోహణం)తో ప్రారంభమవుతుంది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పవిత్ర ధ్వజాన్ని ఎగురవేస్తారు. ఇది పండుగ ప్రారంభానికి సంకేతం. ఆ రోజు నుంచి మదురై నగరం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడుతుంది. మదురై వీధులు దీపాలతో, పూలతో అలంకరించబడతాయి.

ఈ ఉత్సవంలో ముఖ్య ఘట్టం "పట్టాభిషేకం". మీనాక్షి అమ్మవారిని మదురై రాజ్యాధికారిగా ప్రకటించే ఈ కార్యక్రమం చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది. పురాణాల ప్రకారం అమ్మవారు ఒక వీరరాణిగా పాలించినట్లు చెబుతారు.

ఉత్సవంలో మరో అత్యంత ముఖ్యమైనది "దివ్య కల్యాణం". ఇందులో అమ్మవారిని పెళ్లికూతురిలా అలంకరించి, శివుడైన సుందరేశ్వరునితో వివాహం జరిపిస్తారు. ఈ వేడుకకు వేలాది భక్తులు హాజరవుతారు. వివాహ సమయంలో వేద మంత్రాలు, నాదస్వర సంగీతం వాతావరణాన్ని ఆధ్యాత్మికంగా మారుస్తాయి. పెద్ద రథాల్లో దేవతల విగ్రహాలను ఉంచి నగర వీధుల్లో ఊరేగించే కార్యక్రమం ఎంతో అద్భుతంగా ఉంటుంది. భక్తులు రథాన్ని తాడుతో లాగుతూ తమ భక్తిని వ్యక్తపరుస్తారు. ఇది సామూహిక భక్తి, ఐక్యతకు ప్రతీక.

చిత్రై ఉత్సవంలో మరో ముఖ్యమైన భాగం కళగర్ స్వామి ఉత్సవం. ఈ సందర్భంగా శ్రీ మహావిష్ణువు కళగర్ స్వామిగా వైగై నది లోకి దిగడం ఎంతో విశేషంగా భావిస్తారు. ఇది మీనాక్షి అమ్మవారి అన్నయ్యగా భావించే విష్ణువు ఆలస్యంగా వివాహానికి చేరుకున్నట్లు సూచించే ఘట్టం.

ఈ పండుగలో కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాదు, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా జరుగుతాయి. భారతనాట్యం, హరికథ, సంగీత కచేరీలు, దేవర నామసంకీర్తనలు వంటి కార్యక్రమాలు పండుగకు మరింత శోభను చేకూరుస్తాయి.

ఈ ఉత్సవానికి దేశం నలుమూలల నుండి, విదేశాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం,

ఊరేగింపుల్లో పాల్గొనడం ద్వారా తమ భక్తిని వ్యక్తపరుస్తారు. చిత్రై ఉత్సవం మదురై నగరానికి ఆర్థికంగా కూడా ఎంతో సహాయం చేస్తుంది. పర్యాటకులు రావడం వల్ల హోటళ్లు, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. స్థానిక కళాకారులకు కూడా అవకాశాలు లభిస్తాయి.

మొత్తానికి, మీనాక్షి అమ్మవారి చిత్రై ఉత్సవం కేవలం ఒక పండుగ కాదు, అది భక్తి, చరిత్ర, సంస్కృతి, సమాజం అన్నీ కలిసిన మహోత్సవం. ఈ పండుగను ప్రత్యక్షంగా చూడడం ప్రతి భక్తుడికి ఒక జీవితాంతం గుర్తుండిపోయే అనుభవంగా ఉంటుంది.

## విలువలతో కూడిన విద్య




భారతదేశంలో జాతీయవాద భావజాలం అనేది కేవలం రాజకీయ ఆలోచన కాదు; అది సాంస్కృతిక, ఆధ్యాత్మిక, నైతిక మూలాలపై నిర్మితమైంది. ఈ నేపథ్యంలో హైందవ సంస్కృతి జాతీయవాద విలువలతో కూడిన విద్యకు బలమైన పునాదిని అందిస్తుంది. హైందవ ధర్మం "వసుధైవ కుటుంబకం" అనే విశాల దృక్పథాన్ని కలిగి ఉండడం వల్ల, ఇది సంకుచిత జాతీయత కంటే సమగ్ర జాతీయతను ప్రతిపాదిస్తుంది.

హైందవ సంస్కృతిలో "దేశం" అనేది కేవలం భౌగోళిక పరిమితి కాదు; అది ఒక పవిత్రమైన జన్మభూమి (మాతృభూమి)గా భావించబడుతుంది. "భారతమాత" అనే భావన ద్వారా దేశాన్ని తల్లిగా పూజించడం కనిపిస్తుంది.

* భూమిని "మాతృదేవోభవ" భావంతో గౌరవించడం
* నదులు, పర్వతాలు, వృక్షాలు వంటి ప్రకృతి అంశాలను పవిత్రంగా భావించడం
* దేశం పట్ల ఆధ్యాత్మిక అనుబంధం కలిగి ఉండడం

ఈ లక్షణాలు విద్య ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని గాఢంగా నాటుతాయి.

హైందవ సంస్కృతి అనేక శాశ్వత విలువలను ప్రతిపాదిస్తుంది. ఇవి జాతీయవాద విద్యకు పునాది. మన సంస్కృతిలో ధర్మం అనేది ప్రతి వ్యక్తి తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడం తెలుపుతుంది. సత్యం అనేది నిజాయితీ, పారదర్శకత జీవితంలో ఎంత అవసరమో నేర్పుతుంది. అహింస ప్రతిజీవిపై కరుణ చూపడం గురించి తెలియజేస్తుంది. సేవాభావం సమాజం పట్ల నిబద్ధతను చెబుతుంది. సమానత్వం "సర్వే జనాః సుఖినో భవంతు" అనే భావన ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరినీ గౌరవించడం ఎలాగో అలవరుస్తుంది. మరి మన ప్రాచీన గ్రంథాల ప్రభావం మనలో హైందవ సంస్కృతి ఆధారంగా ఉన్న వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు జాతీయవాద విలువలను బలపరుస్తాయి.

ఈ విషయాలనే మన పౌరాణిక గ్రంథాలైన రామాయణం ద్వారా పరిపాలకుడైన శ్రీరాముడు రాజధర్మాన్ని పాటిస్తూ ప్రజల కోసం త్యాగం చేయడం, మహాభారతం ద్వారా ధర్మం కోసం పోరాడే సందేశం, భగవద్గీత ద్వారా కర్తవ్యాన్ని నిస్వార్థంగా చేయడం ఎలాగో నేర్పుతాయి. ఈ గ్రంథాల బోధనలు విద్యలో భాగమైతే, విద్యార్థుల్లో నైతికత, దేశభక్తి పెరుగుతాయి. ప్రాచీన భారతదేశంలోని గురుకుల విద్యా విధానం హైందవ సంస్కృతికి ప్రతీక. గురుశిష్య సంబంధం ద్వారా విలువల బోధన, ప్రకృతితో సమన్వయం, సేవ, క్రమశిక్షణ వంటివి అలవడేవి. ఈ విధానం జాతీయవాద విలువలను సహజంగా అభివృద్ధి చేసింది.

జాతీయ ఐక్యతలో మన హైందవ సంస్కృతి పాత్ర కీలకం. హైందవ సంస్కృతి వైవిధ్యాన్ని అంగీకరిస్తుంది. భిన్న భాషలు, సంప్రదాయాలు ఉన్నా ఒకే సంస్కృతికి చెందిన వారమన్న భావన పెంపొందిస్తుంది. మన దేశంలో అనేక ప్రాంతాలకు తీర్థయాత్రలు చేయడం ద్వారా దేశ ఐక్యత, మన పండుగలు సామాజిక సమరసత వృద్ధి చెందేందుకు తోడ్పడతాయి. ఇవి విద్య ద్వారా బోధిస్తే జాతీయ ఐక్యత బలపడుతుంది.

హైందవ సంస్కృతి ఆధారంగా ఉండే యోగా, ధ్యానం ద్వారా మానసిక స్థైర్యం, సంస్కృత శ్లోకాల ద్వారా నైతిక బోధన, పర్యావరణ పరిరక్షణను ధార్మిక బాధ్యతగా చూపించడం, సేవా కార్యక్రమాలు (సేవా ధర్మం) నిర్వహించడం వంటి విలువలను అందించవచ్చు.

విలువలతో కూడిన విద్య వలన నైతిక విలువలతో కూడిన పౌరుల తయారీ, దేశంపై గౌరవం, బాధ్యత పెంపు, సమాజంలో శాంతి, ఐక్యత, ఆధ్యాత్మికతతో కూడిన సమగ్ర అభివృద్ధి జరుగుతుంది.

హైందవ సంస్కృతి జాతీయవాద విలువలతో కూడిన విద్యకు లోతైన, శాశ్వత పునాది అందిస్తుంది. ఇది కేవలం దేశభక్తిని మాత్రమే కాకుండా, నైతికత, ఆధ్యాత్మికత, సమానత్వాన్ని కూడా బోధిస్తుంది. ఈ విధమైన విద్య ద్వారా వ్యక్తి మంచి పౌరుడిగా మాత్రమే కాకుండా, మంచి మనిషిగా కూడా ఎదుగుతాడు.

అంతిమంగా, హైందవ సంస్కృతిపై ఆధారపడిన జాతీయవాద విద్య "దేశం కోసం జీవించడం" మాత్రమే కాకుండా "ప్రపంచం కోసం మంచిగా జీవించడం" అనే ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి మార్గం చూపుతుంది.

## ఈ నెలలో ఇతర ముఖ్యమైన రోజులు:

1. కూర్మ జయంతి, మే 1
2. హనుమజ్జయంతి, మే 13
3. వతసావిత్రి వ్రతం, మే 16
4. వీర సావర్కర్ జన్మ తిథి, మే 28

## దక్షిణాపథ సంస్థ గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు:

**1. శ్రీ విద్యారణ్యస్వామి జయంతి కార్యక్రమం:**

దక్షిణాపథ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలోని భాగ్యనగర విభాగం దక్షిణ భారత అధ్యయన కేంద్రం, వైశాఖ శుక్ల సప్తమి పవిత్ర దినాన (ఏప్రియల్ 24, 2026) శ్రీ విద్యారణ్య స్వామి పై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా సేవాభారతి సంస్థ ఉపాధ్యక్షులు శ్రీ కే రవీంద్రనాథ్ గారు పాల్గొని, విద్యారణ్య స్వామి వారి జీవితం, తత్వం, చారిత్రక సేవల గురించి లోతైన మరియు ఆలోచనాత్మక ఉపన్యాసాన్ని అందించారు.

ఆయన తన ప్రసంగంలో, భారతదేశం చరిత్రలో ఒక క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు హిందూ సంస్కృతిని పునరుద్ధరించడంలో విద్యారణ్య స్వామి వారి కీలక పాత్రను వివరించారు. ఆయన మార్గదర్శకత్వంలో హరిహరరాయ మరియు బుక్కరాయ హిందూ ధర్మంలోకి తిరిగి వచ్చి, ఒక శక్తివంతమైన

రాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. ఆ దూరాక్రమణలకు వ్యతిరేకంగా వివరించారు.



స్వామి విద్యారణ్య మహర్షి గారి దూరదృష్టి, మార్గనిర్దేశం వల్ల దక్షిణ భారతదేశంలో ధర్మ పరిరక్షణ, హిందూ సంస్కృతి పునరుద్ధరణ సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ మహోన్నత సేవల కారణంగా ఆయనను "హిందూ ధర్మ స్థాపన ఆచార్యుడు"గా గౌరవిస్తారని తెలిపారు. ప్రస్తుత సమాజం కూడా ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని, ముఖ్యంగా హిందువుల మధ్య ఐక్యతను పెంపొందించుకోవాలని రవీంద్రనాథ్ గారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పరిశోధకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని సార్థకం చేశారు.

**2. కాకతి రాణి రుద్రమ దేవి జీవితంపై అవగాహన:**



దక్షిణాపథ అధ్యయన సంస్థ, Andhra Mahila Sabha College of Teacher Education సహకారంతో, ఏప్రియల్ 24, 2026 న రాణి రుద్రమదేవి జీవితంపై ఒక ఉపన్యాసాన్ని నిర్వహించింది. ఇది "చరిత్రలో శక్తివంతమైన మహిళలు" అనే ఉపన్యాస పరంపరలో భాగంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో స్వతంత్ర పరిశోధకురాలు డాక్టర్ బిన్నూరి మనోహరి గారు మాట్లాడారు. రాణి రుద్రమదేవి గురించి లభ్యమయ్యే శాసనాల ఆధారంగా ఆమె గొప్పతనాన్ని వివరించారు. చరిత్రలో అనేక మంది రాణులు ఉన్నప్పటికీ, వారిలో చాలామంది అనుకోకుండా సింహాసనం అధిరోహించారనీ, ఇందుకు భిన్నంగా రుద్రమదేవి మాత్రం ముందుగానే శిక్షణ పొంది, అధికారికంగా పట్టాభిషేకం చేయబడి రాజ్యాన్ని స్వతంత్రంగా పాలించిన ప్రత్యేకమైన మహారాణి అని తెలిపారు.

వివిధ శాసనాల్లో ఆమెకు లభించిన గౌరవాన్ని కూడా వివరించారు. కొలనుపాక శాసనంలో "సర్వరాజన్య కిరీట రత్నాలతో నివాళులు అందుకొనె పాదాలు" అని ఉంది. అంటే అది ఇతర రాజులు ఆమెకు గౌరవంగా నమస్కరించేవారని సూచిస్తుంది. అలాగే ఛాయ సోమేశ్వర ఆలయం శాసనంలో ఆమెను "మహా మండలేశ్వర", "సర్వరాయ మహేశ్వర", "మున్నురాయ" వంటి బిరుదులతో వర్ణించారు. ఇవి ఆమె గొప్ప పాలనా శక్తిని తెలియజేస్తాయి.

రుద్రమదేవి వ్యూహపటిమ, పరాక్రమం, పరిపాలనా నైపుణ్యం చాలా గొప్పవని డా. మనోహరి గారు చెప్పారు. ఆమె ఓరుగల్లు కోటను నిర్మించి కాకతీయ రాజ్యాన్ని రక్షించినట్లు వివరించారు. ఎనభై ఏళ్ల వయస్సులో కూడా యుద్ధరంగంలో పాల్గొన్నారని, దీనికి చందుపట్ల శాసనం సాక్ష్యమని తెలిపారు. ఆమె దీర్ఘకాలం పాటు విశాలమైన సామ్రాజ్యాన్ని విజయవంతంగా పాలించిన మహారాణి అని డా. మనోహరి గారు పేర్కొన్నారు.

ప్రస్తుత తరానికి రుద్రమదేవి ఒక గొప్ప ఆదర్శమని ఆమె వివరించారు. ముఖ్యంగా యువతులు ఆమె విజయాలను తెలుసుకోవాలని సూచించారు. వ్యక్తి ఎవరు అన్నది కాకుండా, తన బాధ్యతను ఎలా నిర్వహిస్తారన్నదే ముఖ్యమని చెప్పారు. చరిత్రలో మనం నేర్చుకోవాల్సిన గొప్ప దృష్టాంతాలలో రుద్రమదేవి జీవితం ఒకటి అని వివరించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి గారు మాట్లాడుతూ, ఇలాంటి ఉపన్యాసాలు నిర్వహించినందుకు దక్షిణాపథ అధ్యయన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి పరిశోధన ద్వారా విద్యార్థులుఏ విషయంపైనైనా లోతైన అవగాహన పొందగలరని చెప్పారు.

దక్షిణాపథ అధ్యయన సంస్థ తెలంగాణ విభాగాధిపతి చంద్రమౌళి కళ్యాణ చక్రవర్తి గారు మాట్లాడుతూ, విద్యార్థులు ఏ విషయాన్నైనా సమగ్ర దృష్టితో చూడాలని సూచించారు. ఒకే కోణంలో అధ్యయనం చేయడం సరిపోదని, విషయాన్ని అనేక కోణాల్లో పరిశీలించడం అవసరమని చెప్పారు. భారతీయ సంప్రదాయం గొప్పదనమంతా ఏ విషయాన్నైనా చర్చ, వాదన, ఆలోచనల ద్వారా సమగ్రంగా అర్థం చేసుకోవడమేనని వివరించారు.

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925